క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్రీపురంకాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, ఈస్ట్ అరోరా కాలేజ్ అపోజిట్, రామాలయం టెంపుల్. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీనగర్, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, కుమారస్వామి టెంపుల్, పంచఫార్మా ఎస్ఐ, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీ మాతా టెంపుల్, పోచమ్మ టెంపుల్, ద్వారకానివాస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: సైదాబాద్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించే ఆషాఢమాస బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే సబితను సైదాబాద్ మాతామైదాన్ శ్రీవిజయ దుర్గా మాతా దేవాలయం కమిటీ ప్రతినిధి సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆమె కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

చెత్త రిక్షాల అందజేత



రిక్షాలు పంపిణీ చేస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బందితో కలిసి సఫాయి కార్మికులకు సోమవారం ఆమె చెత్త రిక్షాలు అందజేసి మాట్లాడారు. శుభ్రత విషయంలో రాజీపడొద్దని, సిబ్బందికి అవసరమైన పనిముట్లు సమకూర్చడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జవాన్ రాజు, ఎస్ఎఫ్ఏ గణేష్, శ్రీనివాస్, నర్సింగ్, ముజిబ్, శ్రీను, అక్షయ్ పాల్గొన్నారు.


నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులతో కార్పొరేటర్ అరుణ సురేందర్‌యాదవ్

లింగోజిగూడ: నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి



చొక్కారావు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల చట్టాలని అమలు చేయాలని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానగోటి చొక్కారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బీసీ చట్టాన్ని తీసుకువస్తున్న ప్రభుత్వం అంతకు ముందు ఉన్న దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఎవరూ కోర్టుకు వెళ్లి పిటిషన్లు వేసి అడ్డుకోవద్దని చెప్పిన ప్రభుత్వం అయితే దివ్యాంగుల చట్టం అమలును అడ్డుకునేలా ఎందుకు ప్రభుత్వం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని ప్రశ్నించారు. దివ్యాంగుల చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చి ప్రత్యేక కమిషన్‌ను నియమించాలని కోరారు.

ప్యాచ్‌వర్క్స్‌పై స్పెషల్ డ్రైవ్

ఉప్పల్: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ప్యాచ్‌వర్క్స్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ గుంతలు ఏర్పడినా.. వెంటనే మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఈఈ హరిలాల్, ఏఈ రాజ్‌కుమార్, కొండ్రు హనుమంతు, సత్యపాల్‌రెడ్డి, గణేష్ తదితరులున్నారు.

వనితకు.. బీమా ధీమా

సమాఖ్య సంఘం సభ్యులకు పొడిగింపు

- ప్రమాదశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం
- ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వం



మహేశ్వరంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం

మహేశ్వరం: మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి ప్రమాద బీమాను 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మహేశ్వరం మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రమాద సమయంలో భరోసా కల్పించినట్లైంది. అందులో సభ్యులుగా ఉన్నవారిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా పరిహారం పొందే సౌలభ్యం ఉంది.

మండలంలో 1089 సంఘాలు

మండలంలోని 1089 సమఖ్య మహిళా సంఘాలు ఉండగా, అందులో 11,645 మంది సభ్యులు ఉన్నారు. వీరు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందుతూ.. స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయా యూనిట్లు, ఉపాధి అవకాశాలు నెలకొల్పి, ఉపాధి పొందుతున్నారు. ప్రమాద బీమాను పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ ఇటీవల జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల మండలంలోని నలుగురు సభ్యులు ప్రమాదవశాత్తు మరణించగా, వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని మండల మహిళా సమాఖ్య అధికారి సత్యనారాయణ తెలిపారు. ఒక్కొక్కరికి త్వరలో రూ.10 లక్షల ప్రమాద బీమా డబ్బులు రానున్నాయి.

సహజ మరణానికి రూ.2లక్షలు

మహిళలను మహారాణులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేకంగా వివిధ పథకాల రూపకల్పన చేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను అందిస్తూ వారు స్వశక్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నారు. సంఘంలో సభ్యులకు ప్రత్యేకంగా రుణ, ప్రమాద బీమా పథకాలను ప్రవేశపెట్టింది. సభ్యులు ఎవరైనా సాధారణ, ప్రమాద బీమాలు అమలయ్యేలా చర్యలు చేపట్టింది. రుణ బీమా పథకంలో సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు అయితే రూ.10 లక్షల వరకు అందించనుంది.

రుణం మాఫీ

సంఘం సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం అందించే రూ.10 లక్షలు నామినీ ఖాతాల్లో జమ చేస్తారు. వారికి సంబంధించిన రుణాన్ని మాఫీ చేస్తారు. 50 శాతం మించిన అంగవైకల్యం ఏర్పడితే సదరం ధ్రువపత్రం ద్వారా పరిశీలించి, రూ.5 లక్షలు అందజేయనున్నారు. ఈ పథకం ప్రారంభించక ముందు రుణం పొందినవారు మరణిస్తే, వడ్డీతో కలిపి చెల్లించాల్సిన బాధ్యత కుటుంబీకులు, సంఘం సభ్యులపై పడేది.

బీమాకు అర్హులు

జిల్లా గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో 18 నుంచి 59 ఏళ్ల వారు స్వయం సహాయ సభ్యురాలిగా ఉన్నవారికి బీమా వర్తిస్తుంది. పథకాన్ని గతేడాది మార్చి 14 ప్రారంభించగా.. నాటి నుంచి ఎవరైనా మృతి చెందితే దీనికి అర్హులు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకున్న వారు మరణిస్తే ప్రభుత్వం చేయూతనందిస్తుంది.

ఆర్థికంగా చేయూత

సంఘాల సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడగించింది. సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. వీరి ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించుకోవడంతో పాటు, పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. సంఘంలోని సభ్యులకు ఏవైనా అనుకోని సంఘటనలు ఎదురైతే వారి కుటుంబాల భవిష్యత్తును చీకటిమయం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ కుటుంబాలకు అండగా ఉండేందుకు బీమాను తెచ్చింది.

సమాఖ్యలో చేరండి



అతివలు.. మహిళా సమాఖ్య సంఘంలో చేరండి. ప్రభుత్వం రుణాలు ఇచ్చి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. సంఘం సభ్యుల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా డబ్బులు అందుతాయి. సంఘంలో తీసుకున్న రుణం డబ్బులు ఖాతాలో జమ అవుతుంది.

– కె.సత్యనారాయణ, మహిళా సమఖ్య ఏపీఎం, మహేశ్వరం

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్‌పీ సింగ్

మన్సూరాబాద్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్‌పీ సింగ్ అన్నారు. జియోలాజికల్ సర్వే రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనూప్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీఎస్ఐ ఉద్యోగులంతా కలిసి ఆడుతున్న ఈ టోర్నమెంట్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ కొనసాగుతుందని, ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీజీలు ఎస్ఎన్ మహాపాత్ర, కేవి మారుతి, ఎంఎన్ ప్రవీన్, హెచ్ఎం మిశ్రా, అపూర్వ భరద్వాజ్, రిక్రియేషన్ క్లబ్ కమిటీ నేతలు రమేష్ గుండా, మాథ్యూ, రసూల్‌ఖాన్,రఘునీ, శ్రీనివాసరావు, అనురాధ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

మన్సూరాబాద్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి కోఆర్డినేటర్ దూగుంట్ల నరేష్ డిమాండ్ చేశారు. యూనైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ కుమ్మరుల సంఘం ఉపాధ్యక్షుడు ఎలుకొండ రాంకోఠి, నాయీ బ్రహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణల ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే, ప్రొఫెసర్ జయశంకర్, కాసోజు శ్రీకాంత్‌చారి విగ్రహాల వద్ద సోమవారం నిరసన తెలిపారు. మహనీయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కుమ్మరులు కుండలతో, నాయీ బ్రహ్మణలు కటింగ్ చేస్తూ వినూత్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత ఉద్యమం చేస్తున్నారని ఆమె పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిందన్నారు. తీన్మార్ మల్లన్న శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయీ బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, మల్లేపాక యాదగిరి, సైదులు, రవి, నిర్మల, బాలమ్మ, సుజాత, సంతోష పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో నాయకులపై ఫిర్యాదు

లింగోజిగూడ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు నరేష్, రాంకోఠి పలువురు మహిళలతో కలిసి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న వైద్య నిపుణులు

దిల్‌సుఖ్‌నగర్: మహిళా ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఆర్‌కేపురంలోని ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉటేరస్ హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాపు విజయవంతంగా ముగిసింది. గైనకాలజిస్టులు, ల్యాప్రోస్కోపిక్ సర్జన్లు పాల్గొని అత్యాధునిక సాంకేతికతపై శిక్షణ పొందారు. ల్యాప్రోస్కోపిక్ అసిస్టెడ్ అల్ట్రాసౌండ్ గైడెడ్ మైక్రోవేవ్ అబ్లేషన్ ఉటేరస్‌లో ఫైబ్రాయిడ్స్ అడెనోమయోసిస్ ఉన్న మహిళలకు గర్భాశయాన్ని తొలగించకుండా చికిత్స చేసే సుర్క్షా ఫర్టిలిటీ సేవింగ్ టెక్నిక్ ఈ పద్ధతి ద్వారా అల్ట్రాసౌండ్ గైడెన్స్‌తో హైప్రిసిషన్ చికిత్స సాధ్యమవుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శంకర్ నాయక్, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: నందనవనంకాలనీ, అగ్రికల్చర్ కాలనీ, విశ్వేశ్వరాయఇంజనీర్స్ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు మూడు కిలోమీటర్ల లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తెలిపారు. సోమవారం జలమండలి ఎం.డీ అశోక్‌రెడ్డిని కలిసి నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో నందనవనంకాలనీలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇటీవల పెరిగిన జనాభాకు అనుగుణంగా జేఎస్ఎన్‌యుఆర్ఎం గృహ నిర్మాణాలతో పాటు ఇతర కాలనీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన డ్రైనేజీ లైన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరగా ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలరన్నారు.

బల్దియా కార్యాలయంలో పనిచేయని లిఫ్ట్

ఎల్‌బీనగర్: జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ పనిచేయకపోవడంతో దివ్యాంగులు వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.మూండతస్తులో ఈ భవనంలో కింది అంతస్తులో సరూర్‌నగర్ , మొదటి అంతస్తులో ఎల్‌బీనగర్ , రెండో అంతస్తులో హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి.ఈ భవనం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ఉండడంతో భవన నిర్వహణ వారే చూస్తున్నారు.వారి సర్కిల్ కార్యలయం కిందనే ఉండడంతో వారు లిఫ్ట్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిల్‌ల్లో వివిధ పనులకు వచ్చే వారు మెట్ల ద్వారా పైకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాయి

సైదాబాద్: ఆషాఢమాస బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని సైదాబాద్ పూసలబస్తీలో జై శ్రీ భవానీ ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మవారి ఘటాల ఊరేగింపునకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకుడు సాయి తెలిపారు. సోమవారం సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అసోషియేషన్ ప్రతినిధులతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డప్పు చప్పుళ్లు, యువత కేరింతలు నృత్యాల నడుమ పోతరాజుల విన్యాసాలతో ఈ నెల 21న అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు.

బోనాల చెక్కుల పంపిణీ

ఎల్‌బీనగర్: పండుగలను ప్రశాంత వాతవరణలో జరుపుకోవాలని, బోనాలంటే తెలంగాణకు సంస్కృతికి ప్రతి రూపం అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాల నిర్వహణకు దేవాలయలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం కర్మన్‌ఘాట్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి 223 దేవాలయాలకు రూ.68.03 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, క్లోం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని సర్కిల్‌లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 15 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.కాప్రా సర్కిల్ 1, ఉప్పల్ సర్కిల్ 2, హయత్‌నగర్ సర్కిల్ 3, ఎల్‌బీనగర్ సర్కిల్ 1, సరూర్‌నగర్ సర్కిల్ 3, ఎల్‌బీనగర్ జోనల్‌లో 5 ఫిర్యాదులు అందాయన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.29, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.65, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.75, చామగడ్డ రూ.26, మునగ రూ.45, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.27, కీర రూ.35, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.77.

స్వచ్ఛత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్‌లో నిర్వహించిన క్లీన్ ఎస్‌కేడీ నగర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు జేసీబీతో కాలనీలో పేరుకుపోయిన మట్టి కుప్పలు, చెట్ల కొమ్మలు, చెత్తను తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు శుభ్రంగా ఉంచుకోవడంతో దోమల వృద్ధి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో అమరేంధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోమారెడ్డి, వెంకటేశ్వరరావు, కృష్ణరావు, పాపారావు, శ్రీనివాస్, తులసిరెడ్డి, రఘుమారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

బడంగ్‌పేట్: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఇండియా యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం సర్కార్ కార్డుల జారీలో తీవ్ర జాప్యం చేస్తుందని ఆరోపించారు. రేషన్ కార్డు లేని వారందరూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని ఏడాదిన్నర అవుతున్నా.. నేటికీ దర్యాప్తు పూర్తి చేయలేదని విమర్శించారు. అన్ని రుణాలకు, ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలకు రేషన్‌కార్డు ముడి పెట్టడంతో అర్హులందరూ దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందిని గమనించి వెంటనే కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: మున్సిపల్‌లోని బాలాపూర్‌లో భీమ్‌రావ్ ప్లేగ్రౌండ్ కమిటీ ఆధ్వర్యంలో బాలాపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ఏడు టీమ్‌లో పాల్గొనగా.. నెలరోజుల పాటు కొనసాగింది. ఫైనల్‌కు బాలాపూర్ హంటర్, బాలాపూర్ వారియర్స్ చేరుకొని పోటీపడగా బాలాపూర్ హంటర్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన టీమ్‌కు సోమవారం కంటెస్టెడ్ కార్పొరేటర్ తిమ్మని గిరీష్, బాల్‌నింగని జంగయ్య, కొప్పుల రాజు, వంగేటి అశ్విన్‌రెడ్డి, చిగురింత దయాకర్‌రెడ్డి, బొర్ర లక్ష్మణ్, బొర్ర దాస్, శివారెడ్డి కలిసి కప్‌తో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్లేగ్రౌండ్ కమిటీ సభ్యులు నర్సింగ్, శ్రీరాములు, టి.సురేష్, కె.ప్రవీణ్, ఏ.ప్రశాంత్, నాగరత్నం, పి.నరేశ్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

వనస్థలిపురం: ఉపాధ్యాయ ఉద్యోగులకు బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పుట్టపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. హయత్‌నగర్ మండలంలో సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం వనస్థలిపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎం, ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బదిలీలు చేయకుండా పదోన్నతులు కల్పిస్తే సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతారని అన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఇటీవల నియమితులైన 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు బకాయి ఉన్న 6 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తు పాండురంగారెడ్డి, సుధాకర్, భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, రామలక్ష్మయ్య, శివ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా మారుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ కాలనీకి చెందిన చంద్రావతికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1.5 లక్షల ఎల్ఓసీని సోమవారం బాధితురాలి భర్త రామకృష్ణకు ఎమ్మెల్యే అందజేశారు.

యువకుడి అదృశ్యం

చైతన్యపురి: తాను పనిచేసిన కంపెనీ వ్యక్తులు, పోలీసులు వేధిస్తున్నారని లేఖ రాసి ఓ యువకుడు అదృశ్యమైన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చంపాపేటకు చెందిన సందీప్ కుమార్ రోటెక్స్ పెట్రోలియం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై మరో ఉద్యోగితో పాటు సందీప్‌కుమార్‌పై మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయమై పోలీసులు అతడిని పిలిపించి మాట్లాడారు. అయితే ఆదివారం రాత్రి తనను కంపెనీ వ్యక్తులు, పోలీసులు వేధిస్తున్నారని డబ్బు చెల్లించకపోతే కుటుంబ సభ్యులపై కూడా కేసు పెడతామని బెదిరించారని లేఖ రాసి సెల్‌ఫోన్‌వదిలేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను చనిపోయేందుకు దూరంగా వెళుతున్నానని లేఖలో పేర్కొన్నాడు. సందీప్ తండ్రి జంగయ్య ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.